

హైదరాబాద్ వార్త

# ముంపు ప్రాంతాలపై కొరవడుతున్న ముందు చూపు

- వర్షాలు ప్రారంభమైనా గ్రేటర్‌లో కానరాని సన్నద్ధత
- వరదల నివారణపై కసరత్తు చేయని అధికారగణం
- ఈ సారీ ప్రజలకు తిప్పలు తప్పేలా లేవు
- వరద ముప్పుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రేటర్ ప్రజలు





**హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త :** రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్ మహా నగరంలో ఉన్న ముంపు ప్రాంతాలపై అధికారులకు ముందు చూపు కొరవడింది. వేసవి కాలం ముగిసి వర్షాలు ప్రారంభమవుతున్నా ఇంకా గ్రేటర్ అధికారగణం నాలాల పూడిక తీత, భూగర్భ డ్రైనేజీల మరమ్మత్తులు చేయలేకపోతున్నారు. వరదలు వచ్చి ప్రజలు అవస్థలు పడే ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత అధికారగణం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. ఈ పాటికే నగరంలోని నాలాలన్నీ పూడిక తీసి, మ్యాన్‌హోళ్లన్నీ మరమ్మత్తులు చేసి ఉండాల్సి ంది. కానీ అధికార యంత్రాంగం ఉదాసీనత కారణంగా ఈ వర్షాకాలంలో గ్రేటర్ హైదరాబాద్ లోని ముంపు ప్రాంత ప్రజలకు అవస్థలు తప్పేలా కనిపించడం లేదు. ఎక్కడ భారీ వర్షాలు వస్తాయో? తమ ఇళ్లలోకి వరద నీరు వస్తుందోనని నగర వాసులు బిక్కుబిక్కుమంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే నగర వాసుల్లో వరద వణుకు సాధారణంగా మారిపోయింది. కానీ ఈ వరద భయం నుంచి బయట పడేసే మార్గాలపై గ్రేటర్ అధికారులు దృష్టి సారించకపోవడం విచారకరం. వరదల్లో గతంలో చాలా మంది మ్యాన్ హోల్స్‌లో పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నా వాటి నుంచి ప్రజలను తప్పించే మార్గాలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది. అక్కడక్కడ కొన్ని నాలాల్లో పూడికలు తీసినా, 70.శాతం వరకు నాలాల్లో ఇంకా పూడిక పనులు పూర్తి అవ్వనే లేదు. ఓ వైపు వాతావరణ శాఖ భారీ వర్షాలు వస్తాయని ప్రకటనలు చేస్తుంటే మరోవైపు ముంపు ప్రాంత ప్రజల గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయి. కానీ అధికారులలో మాత్రం కదలిక లేకపోవడం పట్ల నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పది రోజుల ముందే ప్రారంభమైన వర్షాకాలం**

సాధారణంగా ప్రతీ ఏటా వర్షాకాలం జూన్ రెండో వారం నుంచి ప్రారంభమవుతుంది. కానీ ఈ సారి అనూహ్యంగా పది రోజుల ముందే వర్షాలు కురవడం ప్రారంభమైంది. గ్రేటర్ కమీషనర్, హైడ్రా కమీషనర్లు సంయుక్త సమావేశం నిర్వహించి జూన్ రెండో వారం వరకు నాలాల పూడిక తీత పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కానీ ముందుగానే వర్షాలు కురవడం ప్రారంభమవడంతో పనులు ముందుకు కదులలేక, పూర్తవ్వలేక అధికారులలో ఆందోళన ప్రారంభమైంది. ప్రతీ ఏటా రోహిణి కార్తెలో రోళ్లు పగిలేలా ఎండలు దంచి కొట్టాలి. కానీ వరదలు పారేలా వానలు కురుస్తున్నాయి. చిన్న పాటి వర్షాలకే నగర రోడ్లన్నీ గోదారులుగా మారుతుంటాయి. ఇక ఈ సారి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో నగర వాసుల్లో టెన్షన్ ప్రారంభమైంది. తమను ప్రతీ వర్షాకాలంలో ఇబ్బందులకు గురి చేస్తున్న నాలాల్లో చెత్తను వేయకుండా ప్రజలు ఉండాలి... కానీ, తమ ఇంటిలోని పాత సామాగ్రి అంతటిని అదే నాలాల్లో వేస్తూ వరద నీరు సాఫీగా కిందికి వెళ్లకుండా చేస్తూ అవస్థలు పడుతున్నారన్న వాదనలున్నాయి.

**మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదేశించినా...**

వచ్చా వర్షాకాలంలో గ్రేటర్ ప్రజలు ఇబ్బందులు పడకుండా పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని, నాలాల పూడికలు, మ్యాన్‌హోళ్ల మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అయినా ఇక్కడి అధికారగణం నత్తను తలపించేలా పనులు చేయడంతో ఈ వర్షాకాలంలో నగర వాసులు వరద నీటితో అవస్థలు పడక తప్పనిసరి పరిస్థితులు కనిపిస్తున్నాయి. మంత్రి ముందస్తు ఆదేశాలు జారీ చేసినా అధికారులలో కదలిక లేకపోవడం విచారకరం.

**ముందుకు కదలని హార్వెస్టింగ్‌ల కథ**

భారీ వర్షాలు కురిసిన సమయాల్లో వరద నీటిని ఎక్కడికక్కడే ఇంకిపోయేలా చేయాలని అధికారగణం ప్రణాళికలు రూపొందించింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని సుమారు 50.ప్రాంతాలలో హార్వెస్టింగ్ గుంతలు తీయించాలని అనుకున్నా, అవి కార్యరూపం దాల్చలేదు. ఇప్పటి వరకు కేవలం 11.వరకు పూర్తి చేసినట్లు తెలుస్తుంది. వర్షాలు ప్రారంభమవడంతో మిగితావి నిర్మించే సూచన లు కనిపించడం లేదు. పేపర్ వర్క్ బాగా నే చే స్తున్న గ్రేటర్ అధికారులు ఫీల్డ్ వర్క్ చేయడంలో మాత్రం చాలా వెనుకబడిపోతున్నారన్న అపవాదుంది.

**రెడీ అవుతున్న మాన్సూన్ టీంలు**

వచ్చే వర్షాకాలంలో వరద నీటి ఇబ్బందుల నుంచి ప్రజలను రక్షించేందుకు గ్రేటర్ హైదరాబాద్‌లో మాన్సూన్ టీంలు రెడీ అవుతున్నాయి. ప్రస్తుతానికి 309.టీంలు ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరాలకు అనుగుణంగా ఈ టీంల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

# 'సినిమా' చూపిస్తున్న నేరస్తులు

- నేరాల్లో కొంత ప్రభావముందన్న పోలీసులు
- వెలుగులోకి వస్తున్న కొత్త తరహా కేసులు
- తప్పించుకునేందుకు రకరకాల పన్నాగాలు



**హైదరాబాద్,మే29, ప్రభాతవార్త:** సినిమాలో కథ పండడంతోపాటు ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు కొత్త తరహా క్లైమ్యాక్స్‌లు, ఏమోషనల్ సీన్లతో ఆయా క్రైంలను లేటెస్ట్ టెక్నాలజీతో దూపుగా రూపొందిస్తున్నారు. అయితే నేరస్తులు వాటినే నిజజీవితంలో అలాగే ప్రయోగించి పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. అంతేకాదూ ఒకవేళ పట్టుబడితే సినీ డైలాగులతో మక్కికిమక్కి దింపుతున్నారు. ఒకటి కాదూ..రెండు కదూ... ఎన్నో నేరాలకు సినిమా ప్రభావమే ఉందని అనుమానిస్తున్నారు నగర పోలీసులు. గత నాలుగు నెలల్లో నమోదైన కేసులన్ని కొంత భిన్నంగానే కనిపిస్తున్నాయని చెబుతున్నారు. దొంగతనాలు, కిడ్నాప్‌లు, పోలీసులతో తప్పించుకోవడం వంటి వన్ని సినిమా సీన్లను ఫాలో అవుతున్నారని ఘటనలు రుజువు చేస్తున్నాయి. దృశ్యం సినిమా ఆధారంగా వారం పదిరోజుల క్రితం వివాహేతర సంబంధంతో ఆడిన డ్రామా, మహిళ స్థానంలో పురుషుడి శవంతో కనిపెట్టిన పోలీసులు, గత నెలలో బోయిన్‌పల్లిలో జరిగిన దోపిడి, కాచిగూడ దొంగతనం, బంజారాహిల్స్‌లోని చైన్‌స్నాచింగ్‌లో ఇలా సినిమానే తలపిస్తున్నాయి. ఆయా సీన్లకు ఏమాత్రం తీసిపోదనేవిధంగా ఉంటున్నాయి. ఒక్కోసారి నేరాలను చూసి పోలీసులే కంగుతింటున్నారు. తప్పించుకునేందుకు కొత్త ఎత్తుగడలతో ఎస్కేప్ అవుతున్నారు. ఏడాది క్రితం మధురాపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలా దొంగ అలాగే పరారయ్యాడు.

**భిన్న ఘటనలతో దర్యాప్తు ఆలస్యం..?**

సినిమాలో ఉన్న క్రైం సీన్లను తలపించేవిధంగా గత రెండేళ్లుగా నగరంలో భిన్న రకాల నేరాలు జరుగుతున్నాయి. నకిలీ తుపాకులతో దొంగతనాలు, మర్డర్లు, చైన్‌స్నాచింగ్‌లతో పాటు ఇటీవల చోటు చేసుకున్న వివాహేతర సంబంధాలు సైతం అలాగే ఉంటున్నాయి. పోలీసుల కళ్లుగప్పి తప్పించుకునే విధానం కూడా కాచిగూడ, మధురాపురి ప్రాంతాల నేరాలు ఉన్నాయి. సీసీ కెమెరాలుంటే ముసుగు వేసుకోవడం, లేదంటే కెమెరాలను బద్దలుకొట్టడం, హైడ్రామా క్రియేట్ వంటి ఘటనలే కనిపిస్తున్నాయి. హుందాగా దర్జాగా నల్గురితో కలిసి ఏటీఎంలలో బహిరంగ దోపిడికి పాల్పడితే సంబంధిత బ్యాంకు అధికారులే డబ్బులను జమ చేస్తున్నారనే విధంగా నేరాలు జరుగుతున్నాయి. జ్యోతిష్యులు సైతం అన్ని తెలిసేవిధంగా ఏవో నాలుగు మాటలు నేర్చుకుని ఇంట్లో సమస్యలు, యజ్ఞాలు, యాగాలు చేయడంతో తొలగిపోతాయని సినిమాలో చూపించేవిధంగా ఎముకలు, నల్లటిదారాలతో మాయ చేసి నగదుతో ఎస్కేప్ అయ్యాడు. మర్డర్లు సైతం నటిస్తూ కాకపడుతూ నమ్మించి ప్రాణాలను తీస్తున్నారు. దీనికి అనుగుణంగా స్క్రిప్ట్‌లు రాసుకుంటూ పోలీసులకు దొరికితే చెబుతున్నారు. ఇటీవల వచ్చిన సినిమాలో మాదిరిగా తప్పు చేసిన ముఖంలో భయం, టెన్షన్‌లు లేకుంటే పోలీసులకు అనుమానం రాదని, దాన్ని కలగా చిత్రీకరించి నడుచుకోవాలనే హితోపదేశంతో నేరస్తులు అమలుచేస్తున్నారని వెలుగు చూస్తున్నాయి.

**సినిమాలు చూసే కొత్త నేరస్తులు..**

సులువుగా డబ్బులు సంపాదించేందుకు యువత నేరాల బాట పడుతున్నారు. ఎప్పుడు చేయని నేరస్తులు సినిమాలను చూసి నేర్చుకుంటున్నారని పలువురు పోలీసులు చెబుతున్నారు. అయితే గూగుల్, సినిమాలను చూసి దొంగతనాలు, ఆయా రకాల నేరాలకు పాల్పడుతున్నారు. ఎదుట వారిని ఎలా దృష్టి మరల్చాలని, పోలీసుల కంట పడకుండా ఎక్కడ రహస్యంగా ఉండాలనే విషయా లు సాంకేతిక పరిజ్ఞానంతో అందిపుచ్చుకుని నేరాలకు దిగుతున్నారని అభిప్రాయపడుతున్నారు. జీపీఎస్ ఎలా వాడాలనేది, ఫోన్‌లతో తప్పించుకోవడం వంటివి ప్రయోగిస్తున్నారని పోలీసుల విచారణలో బయటపడుతున్నాయి. సాధారణంగా కొత్తగా దొంగతనం చేసేవారిలో భయం ఉంటుంది. దాంతోనే పోలీసులకు దొరికిపోతారు. కానీ చాలా తెలివిని ప్రదర్శిస్తూ జాగ్రత్త చర్యలు చేపట్టి నేరాలకు పాల్పడుతున్నారు. ఏరోజుకారోజు పోలీసులు కూడా టెక్నాలజీని ఉపయోగించుకుంటూ విచారణలు, సమగ్ర దర్యాప్తులు చేస్తేనే పట్టుకోవడానికి వీలు ఉంటుందని సాంకేతిక నిపుణులు, విశ్రాంత పోలీస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## సైబర్ నేరస్తులు తప్పించుకోలేరు

**- సైబర్‌క్రైం పోలీసుల సమావేశంలో సిపి సివి.ఆనంద్**



సైబర్ క్రైం విభాగాన్ని పరిశీలిస్తున్న నగర సీపీ సీవీ.ఆనంద్

**హైదరాబాద్, మే29,ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటున్న తరుణంలో కొత్తవిధానాలను అనుసరించాలని నగర సీపీ సీవీ.ఆనంద్ అన్నారు. గురువారం బషీర్‌బాగ్‌లోని పాత కమిషనర్ కార్యాలయంలో సైబర్ క్రైం పోలీసుల సమావేశంలో ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేరాలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వెంటనే దర్యాప్తు చేపట్టాలన్నారు. టెక్నాలజీతో నేరాల శాతం గుర్తించి పరిష్కారాల దిశగా కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, విద్యాసంస్థలు, కాలనీ సంఘాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలి. ఇక న్యాయస్థానాలు, బ్యాంకుల సమన్వయం బలోపేతం చేయాలని పేర్కొన్నారు. మోసపోయిన సైబర్ బాధితుల నగదును తిరిగి అందించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని తగు సూచనలు ఇచ్చారు. సాధారణ పోలీస్‌స్టేషన్‌లో కూడా సైబర్ నేరాల ఫిర్యాదులు తీసుకుంటారనే విషయాలను ప్రచారం చేయాలని సీవీ.ఆనంద్ వెల్లడించారు.

## వేర్వేరు సంఘటనల్లో గంజాయి కేసులు నమోదు



గంజాయి కేసుల్లో నిందితులను పట్టుకున్న పోలీసులు

**శేరిలింగంపల్లి, మే 29 ప్రభాతవార్త** శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌టీఎస్‌బి టీం అకస్మిక తనిఖీల్లో ఎండిఎంఏ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. బంజారాహిల్స్ సీఎన్‌ఎన్ తండాలో డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్న ఫర్జానా అనే మహిళ వద్ద దాదాపు 2.06 గ్రాములు ఎండిఎంఏ, 1.3కేజీల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. ఈ కేసులో మధుఅనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ బాలరాజ్ తెలిపారు. డ్రగ్స్ కేసుల్లో నిందితురాలైన ఫర్జానాను శేరిలింగంపల్లి ఎక్సైజ్‌పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు అప్పగించారు.

**మరో కేసులో..**

మలక్‌పేట్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌టీఎఫ్ సిటీ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన అకస్మిక దాడుల్లో 1.3 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ జానీమియా, షేక్ నజీర్,రంగారెడ్డిజిల్లాకు చెందిన పెద్దగొల్ల శ్రీకాంత్‌లు గత కొంత కాలంలో గంజాయి వి క్రయాలను జోరుగా సాగిస్తున్నారు. కాగా ఎస్‌టీఎఫ్ సిటీ పోలీసుల తనిఖీల్లో 1.3 కేజీల గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని మలక్‌పేట్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అదనపు గదుల నిర్మాణాలకై ప్రతిపాదనలు పంపండి

**- రాజ్‌భవన్ హైస్కూల్ సందర్శనలో కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి**



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, మే 29,ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజ్ భవన్‌లో అదనంగా పిల్లలకు అవకాశం కల్పించేందుకు పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకై ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజ్ భవన్, ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాల ఆలియాలను సందర్శించి పాఠశాలలోని ల్యాబ్, డైనింగ్ హాల్, కొత్తగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను ఆయన పరిశీలించారు. రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పిల్లలు ఎక్కడెక్కడ నుండి నుండి వస్తున్నారని, ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారని, పాఠశాలకు ఏమైనా ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరం ఉందా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్ భవన్, ఆలియా మోడల్ స్కూల్ పాఠశాలలకు మంచి పేరు ఉన్నందున ఈ పాఠశాలల్లో చదవాలని చాలామంది విద్యార్థులు వస్తున్నందున, అదనంగా విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు గాను అదనపు తరగతి గదులు నిర్మాణాలపై ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. మంచి ఉపాధ్యాయులు, మెరుగైన సౌకర్యాలు ఉన్నందున ఈ పాఠశాలలకు మంచి డిమాండ్ ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీమియా, డిప్యూటీ ఈఓ బి వెంకటేశ్వర్లుడిప్యూటీ ఐఓఎస్ జివి గుప్తా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ ఆర్ సుజాత, కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**-చిక్కడపల్లి ఏసిపి రమేష్‌కుమార్**




**ముషీరాబాద్, మే 29, ప్రభాతవార్త:** బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ ఎస్.రమేష్‌కుమార్ సూచించారు. నగర పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ జి.రాంబాబు అధ్యక్షతన బక్రీద్ సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై ఏసీపీ మాట్లాడుతూ జూన్ 7వ తేదీ త్యాగానికి ప్రతిరూపంగా జరుపుకునే బక్రీద్ పండుగను మైనార్టీలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, పండుగ సందర్భంగా వ్యర్థాలను జీహెచ్ఎంసీ ఆటోలలో వేయాలి తప్ప రోడ్లపై వేయవద్దని సూచించారు. ఎద్దుల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దని, ఎద్దులను తీసుకువచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ఇతర వర్గాల మనోభావాలు దెబ్బతినకుండా, అందరూ కలసి సోదర భావంతో నిర్వహించుకోవాలని అన్నారు. ముషీరాబాద్ సీఐ రాంబాబు మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ప్రజలు, ప్రభుత్వ అధికారులు అందరూ పోలీసులతో సహకరించి, పండుగను సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో చిక్కడపల్లి సీఐ రాజునాయక్, ముషీరాబాద్ డిఐ నదీమ్ హుస్సేన్, ఎస్ఐలు ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పీస్ కమిటీ, మైనారిటీ నాయకులు అక్తర్ అలీ, షరీఫ్ హుస్సేన్, ఎం.డి.మోహిన్, అక్లక్ హుస్సేన్, ఎజాజ్ హుస్సేన్, జావేద్‌ఖాన్, మహ్మద్‌గౌడ్, మాతావలి, నజీర్‌అలీ, మసూద్, మహ్మద్ అలీ, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాతభవనాలపై 'బల్దియా' ఫోకస్

- టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్వే ముమ్మరం
- శిథిలావస్థలో ఉన్న 428 భవనాలు గుర్తింపు
- 131 గృహాలకు మరమ్మతులకు అవకాశం
- మరో 297 నిర్మాణాలకు నోటీసులు
- నేటి నుంచి వర్షాకాలం ముగిసే వరకు కొత్త సెల్లార్ నిర్మాణాలు బంద్



**హైదరాబాద్,మే 29,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో చారిత్రక కట్టడాలు ఎన్ని ఉన్నాయో ...శిథిలావస్థలో చేరిన భవనాలు కూడా అన్నే ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఏదోఒక చోట శిథిలా భవనాలు కూలిపోవడం ..ప్రాణనష్టం జరగడం సంభవిస్తుంది. వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంది. ఈక్రమంలో శిథిలావస్థలో చేరి బిల్డింగుల విషయంలో కఠినంగా వ్యహరించాలని జిహెచ్ఎంసి నిర్ణయించింది. నగరంలో ఇలాంటి భవనాలు ఎన్ని ఉన్నాయో సర్వే చేపట్టాలని ఇటీవల కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించగా.. డిప్యూటీ సిటీప్లానర్లు, అసిస్టెంట్ సిటీప్లానర్లు కార్యాచరణ రూపొందించి కమిషనర్‌కు అందజేశారు. దీంతో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సెల్లార్లను , పాతబవనాలపై కొత్తనిర్మాణాలు చేపట్టే వారిని సర్కిళ్ల వారీగా నోటీసులు ఇస్తున్నారు. వాస్తవానికి వర్షాకాలం విపత్తు నివారణలో భాగంగా టౌన్ ప్లానింగ్ శిథిల భవనాలను గుర్తించడం, పాత భవనాలు పటిష్టత ,భద్రతపై ఇంజనీరింగ్ విభాగాల అభి ప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, అత్యంత ప్రమాదకర కట్టడాలను కూల్చివేసేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగం సర్వే చేయాలి. ఈడ్రైవ్‌లో భాగంగా పురాతన భవనాలపై జోన్లవారీగా సర్వేచేసి సంబంధిత భవన నాణ్యతపై పరిశీలించి వారికి నోటీసులు ఇవ్వడమే కాకుండా వాటిని కూల్చివేదయం వంటివి చేయాలి. కానీ పలుజోన్లలో ఇలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చూడాలి : కమిషనర్ ఆర్.వి కర్ణన్**

గ్రేటర్‌లో శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించిన నేపథ్యంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం శిథిలావస్థలో లో ఉన్న గృహాలు, సెల్లార్ నిర్మాణాలపై కమీషనర్ తన ఛాంబర్ నుండి జోనల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...వర్షాలు ముందుగానే కురుస్తాయని, వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసించే కుటుంబాలకు అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యజమానులకు మరమ్మతులకు అవకాశం ఇవ్వకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు సమీపిస్తున్న నేపథ్యంలో ముందస్తు ప్రమాదాలు జరగకుండా గుర్తించిన ఇళ్లలో అనుకోని సంఘటన జరిగిన పక్షంలో ఆఏరియా అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తుగానే అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఇంటి చుట్టూ ఉన్న వారిని కూడా అప్రమత్తంగా ఉండి ఆ ఇంటికి దూరంగా ఉండే విధంగా చర్య లు తీసుకోవాలన్నారు, అలాంట గృహాలను సీజ్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్, జోనల్ అధికారులకు ఆదేశించారు. ఇప్పటి వరకు గ్రేటర్ లో 428 శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించడం జరిగిందని, అందులో 131 గృహాలకు మరమ్మత్తులకు అవకాశం ఉందని మిగతా 297 నిర్మాణాలకు నోటీసులు జారీ చేయడం, నిర్మాణ భద్రత పై పరిశీలన చేయడం, యజమానులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఈనెల 30వ తేదీ నుండి వర్షాకాలం ముగిసే వరకు జిహెచ్ఎంసి ప్రాంతంలో ఎలాంటి కొత్త సెల్లార్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదని అధికారులను ఆదేశం చారు. ఇప్పటికే నిర్మించిన సెల్లార్ల విషయంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం బారికేడ్లు నిబంధనల ప్రకారం జాగ్రత్త తీసుకునే విధంగా అంతేకాకుండా సెల్లార్లో నీరు నిలువకుండా సైట్లో యజమానుల కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఇం కా జిహెచ్ఎంసి ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు, సెల్లార్ తవ్వకాలు గుర్తింపు సర్వే స త్వరమే పూర్తి చేయాలని కమీషనర్ అధికారులను ఆదేశించారు. నియమ నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, రవి కిరణ్, వెంకన్న తో పాటుగా హెడ్ ఆఫీస్ టౌన్ ప్లానింగ్ సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి గంగాధర్,వెంకన్న, జోనల్ టౌన్ ప్లానింగ్, సర్కిల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**అత్తాపూర్ మే29,ప్రభాతవార్త :** అగ్ని ప్రమాదాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్ర నాయక్ తెలిపారు. శివరాంపల్లి కేన్ వర్త్ అపార్ట్మెంట్స్ సముదాయాలలో రాజేంద్ర నగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్ర నాయక్ ఆధ్వర్యంలో ప్రజలకు అగ్నిమాపక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై భద్రతపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థులను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి : మహేష్ కుమార్



ముసారాంబాగ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కూరేళ్ల మహేష్ కుమార్, చిట్టుపాక ప్రభాకర్ తదితరులు

**మలక్ పేట ,మే 28, ప్రభాతవార్త :** దళిత విద్యార్థులను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరేళ్ల మహేష్ కుమార్ డిమాండ్ చేశారు. దళిత విద్యార్థులను అవమానించిన గురుకులాల సెక్రెటరీని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల సెక్రెటరీ దళితులను అవమానించిన తీరు చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అవమానకరంగా మాట్లాడిన సెక్రెటరీ మా గురుకులాలకు అవసరం లేదని వెంటనే ప్రభుత్వం స్పందించి గురుకులాల సెక్రటరీని సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్

### థీమ్ పార్క్ పనులు పర్యవేక్షించిన కార్పొరేటర్ లచ్చి రెడ్డి



మహిళా థీమ్ పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, అధికారులు.

**వనస్థలిపురం. మే.29.ప్రభాతవార్త**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ మరియు ఎన్జీవోస్ కాలనీ లో కోటి 99 లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న ఉమెన్ థీమ్ పార్క్ పనులను బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మరియు సంబంధిత ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ అశోక్ రెడ్డి , ఈఈ రమేష్ బాబు ,డిఈ దామోదర్ రావు మరియు జల మండలి డిజిఎం రాజగోపాల్‌తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం కాలనీ లోని పలు సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కార్పొరేటర్ ని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో ఒకటొకటిగా ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మరియు వీలైనంత త్వరగా పార్క్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు,ఇంజనీరింగ్ విభాగం ఎఈ రాజ్ కుమార్, జలమండలి మేనేజర్ భవ్యారెడ్డి, కాలనీ సభ్యులు పంపన వెంకటేశ్వర్లు, ప్రవీణ్, వర్ధిని, వాణి, తరుణం, శర్మ మరియు డివిజన్ పార్టీ నాయకులు శరత్ కుమార్, జైపాల్ రెడ్డి, పవన్ రెడ్డి, సురేష్ కుమార్ మరియు తదితరులు ఉన్నారు.

### ముసారాంబాగ్‌లో పర్యటించిన జోనల్ కమిషనర్



ముసారాంబాగ్ డివిజన్ లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట , మే 28, ప్రభాతవార్త:** ముసారాంబాగ్ డివిజన్ లో సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలభాగ్యలక్ష్మీ లు వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. వర్షాకాలాన్ని పురస్కరించుకుని డివిజన్ లోని పలు ప్రాంతాలలో వారు పర్యటించారు. వర్షం మూలంగా రోడ్లపై వర్షపు నీరు నిలవడం, మట్టి పేరుకుపోవడం, నాళాలలో పూడికతీత తదితర సమస్యల గురించి డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ ఈ సందర్భంగా దృష్టికి జోనల్ కమిషనర్ వెంకన్న దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జయం త్, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, స్థానికులు రాజు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ ఆర్.ఎన్.ఆర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో యాదిరెడ్డి.

**హయత్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** సీపీఐ రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్ 1 శాఖ కార్యదర్శిగా యేశాల నరసింహ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి తెలిపారు. రావి నారాయణరెడ్డికాలనీ ఫేస్ 1లో గురువారం జరిగిన సమావేశంలో నరసింహ మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఆయన వివరించారు. . ఆయనతో పాటు సహాయ కార్యదర్శులుగా దండుగుల మాసయ్య, కలమంద కాశీం, 16 మంది కమిటీ సభ్యులు ఎన్నికైనట్లు యాదిరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయుసీ నాయకులు అజ్మీర్ హరిసింగ్ నాయక్ పాల్గొన్నారు.

## ఉప్పల్ డిగ్రీ కళాశాలలో దోస్త్ రెండో దశ రిజిస్ట్రేషన్లు

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం దోస్త్ ద్వారా రెండో దశ రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయినట్లు ప్రిన్సిపల్ డా.విజయ్‌కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు మే 30వ తేది నుంచి జూన్ 8వ తేది వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఆయన సూచించారు. బిఏ, బికాం, బిఎస్సీ, ఎంపిసి, ఎపిసిసిఎస్. బిజెడ్‌సి, తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వెబ్ అప్షన్‌లలో ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మొదటి పేజ్‌లో కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు కళాశాలలో చేరే అసక్తి గత విద్యార్థులు ఉప్పల్ కూరగాయాల మార్కెట్ వద్ద గత కళాశాలలో సంప్రదించాలని సూచించారు. దోస్త్ అడ్మిషన్లు సమన్వయకర్త జె.విశ్వనాద్‌కుమార్ ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 8985927019 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## విద్యార్థులు పుస్తకాలపై ఆసక్తి పెంపొందించుకోవాలి : డిసిపి డాక్టర్ లావణ్య

**మలక్ పేట, మే 29, ప్రభాతవార్త:**

విద్యార్థులు తమ స్క్రీన్ టైంను తగ్గించుకుని, ఉజ్వల భవిష్యత్తు కోసం పుస్తకాలతోనే స్నేహం చేయాలని మహిళా భద్రతా విభాగం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ లావణ్య నాయక్ సూచించారు. మలక్‌పేటలోని డాన్ హై స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మలక్‌పేట్, పురానీహవేలీ బ్రాంచిలకు చెందిన విద్యార్థులకు ఆమె జ్ఞాపికలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లను గరిష్టంగా ఒక గంట సేపు మాత్రమే ఉపయోగించాలని, అదేవిధంగా వాటిని నిర్మాణాత్మకంగా ఉపయోగించాలని సూచించారు. నిజామాబాద్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన డాక్టర్ లావణ్య, తన జీవితంలోని కొన్ని సంఘటనలు, పరిస్థితులను ఉటంకించడం ద్వారా విద్యార్థులను ప్రేరేపించారు. నిరంతర ప్రయాసం, కష్టపడి పనిచేయడం వల్ల తమ కలను సాకారం చేయడంతో పాటు లక్ష్యాలను సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు. మహిళల భద్రత సంరక్షణ కోసం పాటుపడుతున్న షీ టీం, భరోసా విభాగాల సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా హాజరైన విద్యావేత్త హబీబ్ సల్మానీ మాట్లాడుతూ, డాక్టర్ లావణ్య పోలీసు అధికారిణిగా చాలా మంది జీవితాలపై సానుకూల ప్రభావం చూపించారన్నారు. విద్యావేత్త ముహమ్మద్




విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీసీపీ డాక్టర్ లావణ్య, చిత్రంలో డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహమాన్ తదితరులు

అబ్దుల్ వాజిద్ ఫత్తాహ్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితాల్లో క్రమశిక్షణను తీసుకురావాలని సూచించారు. డాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహమాన్ ఖుర్రమ్ మాట్లాడుతూ పిల్లల కోసం సమయం కేటాయించి, వారిని ప్రేరేపించి, ప్రోత్సహించినందుకు డాక్టర్ లావణ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాన్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆరిఫా, షజియుల్లా ఫిరాసత్, డాక్టర్ సుశేన్, ఇర్ఫాన్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసిలో అవినీతిపై విచారణ జరిపించాలని బిజెపి ధర్నా

**సైదాబాద్, మే 29 ప్రభాతవార్త:**

జిహెచ్ఎంసిలో రోడ్లు వేయకుండానే బిల్లులు తీసుకున్న అవినీతి బాగోతంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో చార్మినార్ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ ఐఎస్ సదన్ డివిజన్‌లోని వాంబే క్వార్టర్స్‌లో గత ఏడాది మంజూరైన సిసి రోడ్డు నిర్మాణం చేపట్టకముందే సదరు కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కయి రూ.10లక్షల బిల్లులు తీసుకున్నారని అన్నారు. అన్ని ఆధారాలతో తాము కమీషనర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అవినీతికి పాల్పడ్డ అధికారులను సస్పెండ్ చేయాలని, ఖాన్ కన్‌స్ట్రక్షన్స్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని కార్పొరేటర్ శ్వేత డిమాండ్ చేశారు. ధర్నాలో సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, గౌలిపుర కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీంద



ధర్నాలో పాల్గొన్న కార్పొరేటర్లు, బిజెపి నాయకులు

ర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అమర్నాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పండరి, శ్రీనాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.27లక్షలతో సిసి రోడ్డు పనులు : బన్నాల గీత

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో రూ.27లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేపడుతున్నామని తెలిపారు. గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో రూ.90 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్ని విధాలుగా సహకరిస్తున్నారని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ వెన్నెలగౌడ్, ఎఇ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రడెడ్డి, ఎం.శ్రీనివాస్, నారాయ



రాఘవేంద్రకాలనీలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

ణరెడ్డి, కె.జగన్, శ్యామ్, కాలనీ నేతలు కౌశిక్, సోమేష్, ఉదయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జైహింద్ ర్యాలీలో పాల్గొన్న మేడ్చల్ కాంగ్రెస్ నేతలు

**బోడుప్పల్, మే 29 ప్రభాతవార్త ;**

ఆపరేషన్ సింధూర్ ని రాజకీయాలకు వాడుకుంటున్న బిజెపి పార్టీ నీచ రాజకీయాలను ప్రజలకు వివరించి, భారత్,పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ పై ట్రంప్ వ్యాఖ్యలకు మోనంగా ఉన్న ప్రధాని మోడీ తీరును ఎండగడుతూ,దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సైనికులకు దేశం యావత్తూ అండగా ఉందని సంఘీభావం తెలుపేందుకు ఏఐసిసి పిలుపు మేరకు, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో నిజాంపేట్ బాచుపల్లి లో జైహింద్ ర్యాలీ విజయవంతంగా జరిగింది. ఈ యాత్రలో మేడ్చల్ ఇన్చార్జ్ తోటకూర వజ్రష్ యాదవ్ బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , బోడుప్పల్ పట్టణ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి భూక్య సుమన్ నాయక్ ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు పుల్లకండ్ల జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు



జైహింద్ ర్యాలీలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , పోగుల నర్సింహారెడ్డి, సింగిరెడ్డి పద్మా రెడ్డి, సుమన్ నాయక్ తదితరులు

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోనున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రామిడి రాంరెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, గుర్రం సాయికిరణ్‌రెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, ఇఎల్‌వి అశోక్, పల్లె జంగయ్యగౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

### జైహింద్ యాత్రలో పాల్గొన్న బడంగ్‌పేట్ మాజీ మేయర్ పారిజాత



జైహింద్ యాత్రలో మీనాక్షి నటరాజన్, బొమ్మ మహేష్‌కుమార్‌లతో బడంగ్‌పేట్ మాజీ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో పోరాడిన సైనికులకు మద్దతుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ బాచుపల్లిలో జరిగిన జైహింద్ యాత్రలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. విఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుండి కెజిఆర్ కన్వెన్షన్ వరకు ప్రతిష్టాత్మకంగా జరిగిన జైహింద్ యాత్రకు హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్, ఎఐసిసి తెలంగాణ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్న ప్రభాకర్‌లతో పాటు పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ కాంగ్రెస్ నేతలతో కలిసి ఆమె పాల్గొన్నారు.

### బాలాపూర్‌లో ఘనంగా మల్లన్న స్వామి కళ్యాణోత్సవాలు



మల్లన్న కళ్యాణాన్ని నిర్వహించిన ఇక్కె కొండల్ కురుమ

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామంలో గురువారం మల్లన్న స్వామి కళ్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు ఇక్కె కొండల్, మేకల సంజీవల నివాసాల్లో మల్లన్న స్వామి కళ్యాణాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలాపూర్ గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, టేకుల సుధాకర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## టిజెఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరించిన టిజెఎఫ్ నాయకులు

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గురువారం టిజెఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జరిగింది. టిజెఎఫ్ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 31వ తేదీన జలవిహార్‌లో జరుగునున్న వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గాదం రమేష్, సతీష్ యాదవ్, జంగయ్యగౌడ్, కృష్ణ, వినయ్, మోహన్, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూలక్ష్మినగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**సైదాబాద్, మే 29 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ భూలక్ష్మి నగర్‌లో రూ.18లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి గురువారంన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొత్తకాపు అరుణ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, వెంకటేష్, నారాయణ, జానప్ప, బుచ్చయ్య, మ మత తదితరులు పాల్గొన్నారు.



భూలక్ష్మినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

## సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ : శ్రీవాణి



సీజనల్ వ్యాధుల నివారణకు పాగింగ్ చేపడుతున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, మే 29 ప్రభాతవార్త :** రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధిలో అధునిక పరికరాలతో 8 చిన్న మిషన్లు, రెండు పెద్ద మిషన్లతో ప్రత్యేక ఫాగింగ్ చేపట్టారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. మురుగునీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఎస్ఇ మాధవరెడ్డి, ఎఇ నరేష్‌రెడ్డి, సూపర్‌వైజర్ మహేందర్, బిజెపి యువ మోర్చ నేతలు ఎం.ప్రభాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ : ఎంఇఓ రామరావు



ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న మండల విద్యాధికారి రామరావు తదితరులు

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** ఉప్పల్ మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేపట్టినట్లు మండల విద్యాధికారి రామరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్‌లోని కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజుల్లోగా అన్ని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు మండల కేంద్రానికి 90 శాతం పుస్తకాలు వచ్చాయని ఆయన తెలిపారు. అదే విధంగా పాఠశాలకు ఏకరూప దుస్తులు కూడా అందజేస్తామని, పాఠశాలలు తెరిచే లోగా దుస్తులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మిదేవి, అశోక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :**

ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న నలుగురిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ ఎక్సైజ్ సిఐ బి.ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి డిపిఇఓ సూచనల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ మల్కాజిగిరి పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం ఉప్పల్ ఎక్సైజ్ ప్రోహిబిషన్ సిబ్బందితో కలిసి నాచారం, మల్లాపూర్ ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో ఎండు గంజాయి రవాణా అమ్మకాలు చేస్తున్నారని సమా చారం అందింది. దీంతో పోలీసులు మల్లాపూర్ పారిశ్రామికవాడ ప్రాంతంలో నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వీరిలో పరకాల వినయ్, నేరెళ్ల నవీన్‌గౌడ్, స్వర్గం అమర్‌నాథ్, పి.నిఖిల్‌కుమార్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 13.5 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒరిస్సా నుంచి గంజాయి తెచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయాలు చేస్తున్నారని సిఐ తెలిపారు. అకస్మిక తనిఖీలతో ఎక్సైజ్ సిఐ ఓంకార్‌తోపాటు, ఎస్ఐ శ్రీనివాసులు, నరేష్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయి విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేసిన ఉప్పల్ ఎక్సైజ్ సిఐ ఓంకార్ తదితరులు

## అదనపు బస్సులు నడపాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న నర్సింహ, గ్రామస్థులు

**హయత్ నగర్, మే 29 ప్రభాతవార్త:** గండి చెరువు గ్రామానికి అదనపు బస్సులు నడిపించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్థులు హయత్ నగర్ డిపో మేనేజర్ కి గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ అబ్దుల్లా పూర్ మెట్ మండల కార్యదర్శి ఇ.నర్సింహ మాట్లాడుతూ... గ్రామానికి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లలేకపోతున్నారని తెలిపారు. గ్రామానికి ఆటోలు కూడా రావని, దీంతో అత్యవసర పరిస్థితి వస్తే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. పక్క గ్రామాలకి ఫోన్ చేసి ఆటోలు పిలిపించుకొని వెళ్ళవలసి వస్తోందన్నారు. వారం రోజులలో సమస్య పరిష్కరించని పక్షంలో గ్రామంలోకి వచ్చే బస్సులను ఆపేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన డీఎం... అదనపు బస్సు ను నడపడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, శ్రీరాంమూర్తి, మాల్యాద్రి, భాగ్యలక్ష్మి, అనిత, అన్నపూర్ణ, రాణి, భార్గవి, బాలమ్మ పాల్గొన్నారు.

## నేడు మీర్‌పేట్ కార్పొరేషన్‌లో బిజెపి తిరంగా ర్యాలీ : పసునూరి బిక్షపతిచారి

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:**

ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా వీర జవాన్లకు మద్దతుగా వారి గౌరవార్థం బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని కార్పొరేషన్ బిజెపి-1 అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచారి తెలిపారు. ఈ ర్యాలీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు లెనిన్‌నగర్ వాటర్ ట్యాంకు నుండి ప్రారంభమై బాలాపూర్ చౌరస్తా వరకు సాగుతుందని ఆయన వెల్లడించారు. ఈ ర్యాలీకి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, సీనియర్ నేతలు తూళ్ళ వీరేందర్‌గౌడ్, కొలన్ శంకర్‌రెడ్డిలతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరవుతున్నారని ఆయన వివరించారు. ఈ మేరకు బిజెపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధశ్రేణులు, పార్టీ సానుభూతిపరులు హాజరుకావాలని బిక్షపతిచారి కోరారు.